9

సాక్షి వనపర్తి

బుధవారం । 23 । ఏప్రిల్ । 2025

సివిల్స్‌లో మెరిసిన పాలమూరు బిడ్డలు

- నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి ముగ్గురికి మెరుగైన ర్యాంకులు
- మూసాపేట మండలం నిజాలాపూర్‌కు చెందిన మరో యువకుడి ప్రతిభ

వివరాలు 10లో ►

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి నలుగురు యువకులు సివిల్స్‌లో సత్తాచాటారు. మంగళవారం విడుదలైన యూపీఎస్సీ ఫలితాల్లో నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మన్ననూరుకు చెందిన మండలి సాయికిరణ్ ఆలిండియా 298వ ర్యాంక్ సాధించారు. అలాగే వెంకటేష్‌ప్రసాద్ (700ర్యాంక్), యశ్వంత్‌నాయక్ (432 ర్యాంక్), ఆంజనేయులు (934 ర్యాంక్) సాధించారు. - సాక్షి నెట్‌వర్క్



సాయికిరణ్ (298 ర్యాంకు)



వెంకటేష్ ప్రసాద్ (700 ర్యాంకు)

ఇంటర్‌లో నిరాశజనక ఫలితాలు

- ఫస్టియర్‌లో 18, సెకండియర్‌లో 22వ స్థానం
- గతంతో పోల్చితే స్వల్పంగా పెరిగిన ఉత్తీర్ణత
- మరోసారి బాలికలదే పైచేయి



వనపర్తి విద్యావిభాగం: ఇంటర్మీడియట్ ఫలితాల్లో రాష్ట్రవ్యాప్తంగా వనపర్తి జిల్లాకు మరోసారి నిరాశజనక ఫలితాలే వచ్చాయి. గతేడాదితో పోలిస్తే ఉత్తీర్ణత శాతం పెరిగినా అనుకున్న స్థాయిలో ఫలితాలు రాలేదు. ప్రథమ సంవత్సరానికి సంబంధించి జనరల్‌కు సంబంధించి 5,293 మంది పరీక్షకు హాజరు కాగా.. 58.62 శాతంతో 3,103 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఇందులో బాలురు 2,578 మంది విద్యార్థులు హాజరుకాగా.. 47.67శాతంతో 1,229 మంది, బాలికలు 2,715 మంది హాజరు కాగా.. 69.02 శాతంతో 1,874 మంది ఉత్తీర్ణత సాధించారు. బాలురతో పోలిస్తే బాలికలు 21.35 శాతం అధికంగా ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరానికి సంబంధించి మొత్తం 4,748 మంది విద్యార్థులు హాజరు కాగా.. 67.35 శాతంతో 3,198 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఇందులో బాలురు 2,236 మంది హాజరు కాదా.. 58.27 శాతంతో 1,303 మంది, బాలికలు 2,512 మంది హాజరు కాగా.. 75.44శాతంతో 1,895 మంది ఉత్తీర్ణత సాధించారు. బాలుర కంటే బాలికలు 17.17 శాతం అధికంగా ఉత్తీర్ణత పొందారు. గతేడాదితో పోలిస్తే ఫస్టియర్‌లో 52.58 శాతంతో రాష్ట్రంలో 23వ స్థానంలో ఉన్న జిల్లా.. ఈ ఏడాది 18వ స్థానంలో నిలిచింది. సెకండియర్‌లో గతేడాది 64.75 శాతం ఉత్తీర్ణతతో 20వ స్థానంలో నిలవగా.. ఈ ఏడాది 22వ స్థానంలో నిలిచింది.

■ మే 22వ తేదీ నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నారు. పరీక్ష ఫీజు చెల్లించేందుకు ఈ నెల23 నుంచి 30వ తేదీ వరకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. వీటితోపాటు రీ కౌంటింగ్, రీవెరిఫికేషన్ కోసం కూడా ఈ నెల 30 వరకు ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చు.

జాతీయ స్థాయిలో సత్తాచాటాలి



వనపర్తి టౌన్: రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ అండర్–14 జట్టు మంగళవారం జిల్లాకేంద్రం నుంచి మహారాష్ట్రలో జరగనున్న జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు తరలివెళ్లినట్లు డీవైఎస్‌ఓ సుధీర్ కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు క్రీడాకారులను అభినందించారు. ఫోన్‌లో క్రీడాకారులు ఎమ్మెల్యే మేఘారెడ్డి అభినందనలు తెలిపి, జాతీయ స్థాయిలో సత్తా చాటాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, స్కూల్ గేమ్స్ సెక్రటరీ సురేందర్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, రాజేందర్, అనిల్ తదితరులు పాల్గొన్నారు. జిల్లాకేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి ప్రణీత్ జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడని ఫిజికల్ డైరెక్టర్ కుమార్ తెలిపారు.

పారదర్శకంగా వరిధాన్యం కొనుగోలు

వనపర్తి: సన్న రకం, దొడ్డు రకం వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు వేర్వేరుగా ఉండాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఐకేపీ, పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ఏపీఎం, సీసీలతో కొనుగోలు కేంద్రాల పనితీరుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వరిధాన్యం కొనుగోళ్లు పారదర్శకంగా చేపట్టాలన్నారు. నిబంధనల ప్రకారం నాణ్యమైన వరి కొనుగోలు చేసి ఇవ్వాల్సిన బాధ్యత కేంద్రాల నిర్వాహకులదేనని స్పష్టం చేశారు. నిర్ణీత నమూనాలో రిజిష్టర్లు నిర్వహించాలని, వచ్చిన వడ్ల వివరాలు, తేమ శాతం తేదీల వారిగా పక్కాగా నమోదు చేయాలని సూచించారు.

■ ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి మే 5లోపు లబ్ధిదారుల తుది జాబితా సిద్ధం చేస్తామని కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. హైదరాబాద్ నుంచి రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సీఎస్ శాంతికుమారితో కలిసి ఇందిరమ్మ ఇళ్లు, భూ భారతి చట్టంపై కలెక్టర్లతో వీసీ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వివరిస్తూ.. లబ్ధిదారుల జాబితా ఇందిరమ్మ కమిటీల నుంచి తీసుకొని ప్రత్యేకాధికారుల ద్వారా స్క్రూటినీ చేయించి ఎమ్మెల్యే, మంత్రి ఆమోదంతో తుది జాబితా రూపొందిస్తామన్నారు. పైలెట్ ప్రాజెక్ట్‌గా ప్రారంభించిన గ్రామాల్లో ఇప్పటి వరకు 406 ఇళ్లు గ్రౌండింగ్ అయ్యాయని, వాటిలో 80 మంది లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు జిల్లాలో ఇసుక ఉచితంగా ఇస్తామన్నారు. ఎల్ఆర్ఎస్ సైతం పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఆయా సమావేశాల్లో అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, యాదయ్య, ఆర్డీఓ సుబ్రమణ్యం, జిల్లా సివిల్ సప్లయ్ అధికారి విశ్వనాథ్, డీఏఓ గోవింద్‌నాయక్, జిల్లా కోపరేటివ్ అధికారి రాణి, డీఎం జగన్‌మోహన్, హౌసింగ్ పీడీ పర్వతాలు, డీఈఓ విఠోబ తదితరులు పాల్గొన్నారు.



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

రామన్‌పాడులో 1,015 అడుగుల నీటిమట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో మంగళవారం పూర్తిస్థాయి నీటిమట్టం 1,015 అడుగులకు చేరిందని ఏఈ వరప్రసాద్ తెలిపారు. జూరాల ఎడమ, సమాంతర కాల్వల ద్వారా వచ్చే నీటిని నిలిపివేశారు. దీంతో ఎన్టీఆర్ కాల్వ ద్వారా 2 క్యూసెక్కులు, కుడి, ఎడమ కాల్వల ద్వారా 20 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వదిలామని ఏఈ చెప్పారు.

క్లుప్తంగా

అనవసర భయం విద్యార్థి ప్రాణం తీసింది..

- ఇంటర్ ఫస్టియర్‌లో ఉత్తీర్ణత సాధించిన మల్లెందొడ్డి విద్యార్థి


వినోద్ (ఫైల్)

మల్దకల్: ఇంటర్‌లో ఫెయిల్ అవుతానేమోనన్న భయంతో మల్దకల్ మండలంలో ఓ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన విషయం విదితమే. అయితే సదరు విద్యార్థి మంగళవారం విడుదలైన ఇంటర్ మొదటి సంవత్సరం ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించాడు. వివరాల్లోకి వెళ్తే.. మల్దకల్ మండలం మల్లెందొడ్డి గ్రామానికి చెందిన వినోద్ జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఇంటర్ వార్షిక పరీక్షల అనంతరం విద్యార్థి తాను రాసిన పరీక్షల్లో ఫెయిల్ అవుతాననే భయంతో ఆందోళనకు గురయ్యాడు. ఈ క్రమంలో 10 రోజుల క్రితం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందాడు. మంగళవారం విడుదలైన ఇంటర్ ఫలితాల్లో వినోద్ పాస్ కావడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. అనవసర భయమే తమ బిడ్డ ప్రాణం తీసిందని వాపోయారు.

తాటిచెట్టుపై నుంచి పడి వ్యక్తి మృతి

రాజోళి: తాటిచెట్టుపై నుంచి పడి వ్యక్తి మృతిచెందిన ఘటన రాజోళి మండలం మాన్‌దొడ్డి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. మాన్‌దొడ్డికి చెందిన నడిపి ఆంజనేయులు (52) కూలీ పనులు చేసుకుని జీవనం సాగించే వాడు. ప్రస్తుతం తాటిముంజల సీజన్ కావడంతో, వాటిని విక్రయించి కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో రోజు మాదిరిగానే గ్రామ సమీపంలో తాటి కాయలు తెంచేందుకు చెట్టుపైకి ఎక్కిన ఆయన.. ప్రమాదవశాత్తు కిందపడటంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

రేపు జాబ్ మేళా

గద్వాల: నిరుద్యోగ యువతకు గద్వాల, హైదరాబాదు కంపెనీలో ఉపాధి కల్పించుటకు ఈ నెల 24న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఎంప్లాయిమెంట్ జిల్లా అధికారి ప్రియాంక మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాబ్‌మేళాలో పాల్గొనే నిరుద్యోగులు 18 నుంచి 35 ఏళ్ల లోపు ఉండి ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఏదైనా డిగ్రీ అర్హత ఉన్నవారు 24వ తేదీన గద్వాల పట్టణంలో బీసీ స్టడీసర్కిల్‌లో ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు జరిగే పాల్గొనాలని సూచించారు. నవభారత్ ఫర్టిలైజర్స్ కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు కల్పించబడుతుందని యువత సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

వేరుశనగ క్వింటా రూ.5,939



గద్వాల వ్యవసాయం: గద్వాల మార్కెట్‌యార్డుకు మంగళవారం 409 క్వింటాళ్ల వేరుశనగ రాగా, గరిష్టం రూ. 5939, కనిష్టం రూ. 2899, సరాసరి రూ. 3669 ధరలు పలికాయి. అలాగే, 20 క్వింటాళ్ల కంది రాగా గరిష్టం రూ. 6319, కనిష్టం రూ. 5806, సరాసరి రూ. 3669 ధరలు వచ్చాయి. 117 క్వింటాళ్ళ ఆముదాలు రాగా గరిష్టం రూ. 5939, కనిష్టం రూ. 5639, సరాసరి రూ. 5879 ధరలు పలికాయి. 2294 క్వింటాళ్ళ వరి (సోన) రాగా గరిష్టం రూ.2046, కనిష్టం రూ. 1701, సరాసరి రూ.1945 ధరలు లభించాయి.

సివిల్స్‌లో మెరిసిన పాలమూరు బిడ్డలు

సాక్షి, నాగర్‌కర్నూల్/వెల్దండ/వంగూరు/అడ్డాకుల: యూపీఎస్సీ ఫలితాల్లో పాలమూరు బిడ్డలు సత్తా చాటారు. నల్లమలలోని అమ్రాబాద్ మండలం మన్ననూర్ గ్రామానికి చెందిన మండలి సాయికిరణ్ మంగళవారం విడుదలైన యూపీఎస్సీ ఫలితాల్లో ఆలిండియా 298 ర్యాంకు సాధించారు. హైదరాబాద్‌లోని ప్రైవేటు కళాశాలలో డిగ్రీ, ఎంబీఏ పూర్తిచేసిన సాయికిరణ్.. తొలి ప్రయత్నంలోనే సివిల్స్ సాధించడం విశేషం. సాయికిరణ్ తల్లి పుష్పమ్మ గృహిణి కాగా.. తండ్రి మండలి లింగమయ్య ప్రస్తుతం పెద్దకొత్తపల్లి మండలంలో ఎంపీఓగా పనిచేస్తున్నారు.



ఆన్‌లైన్‌లో శిక్షణ తీసుకున్నా..

"నాకు చిన్నప్పటి నుంచి సివిల్స్ సాధించాలని లక్ష్యం ఉండేది. హైదరాబాద్‌లో డిగ్రీ పూర్తి చేశాక.. ఎంబీఏ చేస్తూనే సివిల్స్‌కు సన్నద్ధం అయ్యాను. ఏడాదిపాటు ఆన్‌లైన్‌లో శిక్షణ తీసుకుని ఇంటి వద్దే ఉండి ప్రిపేర్ అయ్యాను. నా తల్లిదండ్రుల ప్రోత్సాహంతో తొలి ప్రయత్నంలోనే విజయం సాధించడం ఆనందంగా ఉంది. – సాయికిరణ్, మన్ననూర్



■ మూసాపేట మండలం నిజాలాపూర్‌కు చెందిన మునుగల్‌చేడ్ సత్యయ్య, యశోద దంపతుల కుమారుడు ఎం.వెంకటేశ్ ప్రసాద్ సాగర్ జాతీయ స్థాయిలో 700 ర్యాంకు సాధించారు. గత మార్చి 30న విడుదలైన గ్రూప్–1 ఫలితాల్లో 27వ ర్యాంకు సాధించిన అతడు.. ఈసారి యూపీఎస్సీ ఫలితాల్లోనూ సత్తా చాటారు. ఆయన అనంతపురం జిల్లా పుట్టపర్తిలోని శ్రీసత్యసాయి విద్యా సంస్థల్లో ఇంటర్(ఎంపీసీ), డిగ్రీ(బీఎస్సీ ఫిజిక్స్), పీజీ పూర్తి చేశారు. మొదటిసారి యూపీఎస్సీ పరీక్ష రాసి 700 ర్యాంకు సాధించారు. ఇదిలా ఉంటే, వెంకటేశ్ ప్రసాద్ తండ్రి సత్యయ్య ప్రస్తుతం కోయిలకొండ మండలంలో ఎలక్ట్రికల్ ఏఈగా పనిచేస్తుండగా.. తల్లి యశోద గృహిణి. పదేళ్లుగా సత్యయ్య కుటుంబంతో కలిసి మహబూబ్‌నగర్‌లోని శేషాద్రినగర్‌లో నివాసముంటున్నారు.

ఐఏఎస్ కావడమే లక్ష్యం..

అమ్మా, నాన్న పోత్సాహంతో చదువులో రాణించాను. దూర ప్రాంతాల్లో నా విద్యాభ్యాసం పూర్తిచేశాను. యూపీఎస్సీ పరీక్ష కోసం ఢిల్లీలోని వాజీరాం కోచింగ్ సెంటర్ ద్వారా ఆన్‌లైన్ కోచింగ్ తీసుకున్నా. 15 నెలలపాటు కోచింగ్ తీసుకుని పరీక్ష రాస్తే 700 ర్యాంకు వచ్చింది. ఐఏఎస్ కావడమే నా లక్ష్యం. ఇందుకోసం మరోసారి ప్రయత్నం చేస్తాను. – ఎం.వెంకటేశ్ ప్రసాద్ సాగర్ ,నిజాలాపూర్



■ వెల్దండ మండలం పోచమ్మగడ్డ తండాకు చెందిన వడ్యావత్ యశ్వంత్ నాయక్ సివిల్స్ ఫలితాల్లో 432వ ర్యాంకు సాధించారు. ఆయన గతేడాది యూపీఎస్సీ ఫలితాల్లో 627వ ర్యాంక్ సాధించి ఐపీఎస్‌గా మహారాష్ట్రకు ఎంపికయ్యారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని నేషనల్ పోలీసు అకాడమీలో ఐపీఎస్ శిక్షణ పొందుతున్నారు. ఐఏఎస్ లక్ష్యంగా మరోసారి యూపీఎస్సీ పరీక్ష రాసి.. మెరుగైన 432వ ర్యాంక్ సాధించారు. ఐఏఎస్ కావడమే తన లక్ష్యమని యశ్వంత్ నాయక్ చెప్పారు. కాగా, యశ్వంత్ తండ్రి ఉమాపతి హైదరాబాద్‌లో ఎస్బీఐ ఏజీఎంగా విధులు నిర్వర్తిస్తున్నారు. నారాయణ కళాశాలలో ఇంటర్మీడియట్, ఐఐటీ మద్రాస్‌లో మెకానికల్ ఇంజినీరింగ్ పూర్తిచేశారు.



■ వంగూరు మండలం తిప్పారెడ్డిపల్లికి చెందిన గోకమొల్ల ఆంజనేయులు పట్టుదలతో చదివి ఆలిండియా 934వ ర్యాంకు సాధించారు. నిరుపేద కుటుంబంలో జన్మించిన ఆంజనేయులు.. 1నుంచి 7వ తరగతి వరకు స్వగ్రామమైన తిప్పారెడ్డిపల్లిలో.. 8నుంచి 10వ తరగతి వరకు గాజరలోని ప్రభుత్వ పాఠశాలలో చదివారు. ఇంటర్, ఐఐటీని కడప జిల్లా ఇడుపులపాయలో పూర్తిచేశారు. అనంతరం హైదరాబాద్‌లో సివిల్స్ కోచింగ్ తీసుకున్నారు. సివిల్స్‌లో అత్యుత్తమ ప్రతిభ చాటడంతో ఆయన తల్లిదండ్రులు శ్రీనివాసులు, కృష్ణమ్మతో పాటు గ్రామస్తులు హర్షం వ్యక్తంచేశారు.

'పాలమూరు' పనుల పరిశీలన

కొల్లాపూర్ రూరల్: మండలంలోని ఎల్లూరు సమీపంలో చేపట్టిన పాలమూరు ప్రాజెక్టు మొదటి లిఫ్ట్ పనులను ఈఎన్‌సీ అనిల్ కుమార్‌తో పాటు ఇరిగేషన్‌శాఖ ఉన్నతాధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా 1, 2, 3 ప్యాకేజీల పనుల పురోగతిని తెలుసుకున్నారు. 3వ ప్యాకేజీ పనులను డ్రోన్ కెమెరాలతో పరిశీలించి.. అధికారులకు పలు సూచనలు చేశారు. నిర్మాణ పనులను వేగంగా పూర్తిచేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం నార్లాపూర్ రిజర్వాయర్ నిర్మాణంతో పాటు ప్రధాన కాల్వ పనులను పరిశీలించారు. పంప్‌హౌజ్, ప్రధాన కాల్వ హెడ్ రెగ్యులేటరీ పనుల పురోగతిని తెలుసుకున్నారు. అనంతరం కేఎల్ఐ మొదటి లిఫ్ట్‌ను సందర్శించి.. పంప్‌హౌజ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఎన్‌సీ మాట్లాడుతూ.. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో 817 అడుగుల నీటిమట్టం ఉందన్నారు.


పాలమూరు ఎత్తిపోతల ప్యాకేజీ-1 జీరో పాయింట్ వద్ద ప్రాజెక్టు మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఈఎన్‌సీ అనిల్ కుమార్ తదితరులు

వేసవిలో తాగునీటికి ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు. కరివెన, వట్టెం రిజర్వాయర్ల పనులను త్వరగా పూర్తిచేసి.. 50 టీఎంసీల నీరు వచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సీఈ సత్యనారాయణ రెడ్డి, ఈఈ శ్రీనివాసరెడ్డి, డీఈలు, జేఈలు పాల్గొన్నారు.

ఆగని అన్వేషణ

- ఎస్ఎల్‌బీసీ సొరంగంలో కొనసాగుతున్న సహాయక చర్యలు
- డేంజర్ జోన్ సమీపంలో తవ్వకాలు


సొరంగంలో తొలగించిన టీబీఎం ప్లాట్‌ఫాం విడిభాగాలను బయటికి తరలిస్తున్న లోకో ట్రైన్

అచ్చంపేట: ఎస్ఎల్‌బీసీ సొరంగంలో చిక్కుకున్న కార్మికుల ఆచూకీ కోసం రెండు నెలలుగా అన్వేషణ కొనసాగుతోంది. ఫిబ్రవరి 22న ఎస్ఎల్‌బీసీ సొరంగం పైకప్పు కూలిన ఘటనలో 8 మంది కార్మికులు గల్లంతైన విషయం విదితమే. వీరిలో ఇద్దరు కార్మికుల మృతదేహాలను వెలికితీయగా.. మిగతా ఆరుగురి కోసం సొరంగం మొత్తం జల్లెడ పడుతున్నా వారి ఆచూకీ లభించడం లేదు. డీ–1 నుంచి డీ–2 ప్రదేశం వరకు దాదాపుగా శిథిలాల తొలగింపు పూర్తికావొచ్చింది. డీ–1 నిషేధిత ప్రదేశం సమీపంలో మరో 15 మీటర్ల వరకు మట్టి, రాళ్లు, బురదను తొలగించే పనులను రెస్క్యూ సిబ్బంది చేపడుతున్నారు. ఈ పనులు వారం రోజుల్లో పూర్తయ్యే అవకాశం ఉంది. నిషేధిత 43 మీటర్ల పరిధిలో ఆరుగురు కార్మికులు ఉండి ఉండవచ్చనే అభిప్రాయానికి వచ్చారు. మంగళవారం చేపట్టిన సహాయక చర్యల్లో సింగరేణి మైన్స్ రెస్క్యూ బృందం మేనేజర్లు రాజేందర్‌రెడ్డి, మాధవరావు, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, హైడ్రా, ఆర్మీ, దక్షిణమధ్య రైల్వే, ర్యాట్ హోల్ మైనర్స్, ఇరిగేషన్, జేపీ కంపెనీ వంటి 12 రకాల విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయండి

డీజీపీని కలిసిన ఎంపీ డీకే అరుణ, ప్రశాంత్‌రెడ్డి

మహబూబ్‌నగర్ క్రైం: దేవరకద్ర బీజేపీ నేత హత్యకు చేసిన కుట్ర వ్యవహారంపై మంగళవారం హైదరాబాద్‌లో డీజీపీ జితేందర్‌ను మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణతో పాటు డోకూర్ పవన్‌కుమార్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. కొన్ని రోజులుగా ప్రశాంత్‌రెడ్డి హత్యకు కుట్రలు చేస్తున్నారన్నారు. అందులో భాగంగా రూ. 2.50కోట్లకు సుపారీ ఇచ్చి కుట్ర చేసినట్లు అనుమానం ఉందన్నారు. దేవరకద్ర, మహబూబ్‌నగర్ పరిసరాల్లో కొన్ని రోజుల నుంచి ప్రశాంత్‌రెడ్డి కదలికలపై రెక్కీ నిర్వహించారన్నారు. భూత్పూర్ పోలీసుల అదుపులో నలుగురు అనుమానితులు ఉన్నట్లు ఎంపీ తెలిపారు. ఈ కుట్ర వెనుక ఎవరి హస్తం ఉందనే విషయంపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయాలని డీజీపీని కోరారు.

ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటుపై చర్చ

రాజోళి: మండలంలోని పెద్దధన్వాడ గ్రామంలో నిర్మించ తలపెట్టిన ఇథనాల్ ఫ్యాక్టరీపై మంగళవారం ఆర్డీఓ కార్యాలయంలో చర్చలు జరిగినట్లు తహసీల్దార్ పి.రామ్మోహన్ తెలిపారు. ఫ్యాక్టరీపై ఉన్న అపోహలను తీర్చేందుకు ఫ్యాక్టరీ యాజమాన్యం కూడా కార్యాలయానికి రాగా.. ఆర్డీఓ శ్రీనివాస్ రావ్ ఆధ్వర్యంలో చర్చలు జరిపారు. కాగా ఫ్యాక్టరీపై ఉన్న అనుమానాలను నివృత్తి చేసేందుకు ఇతర కంపెనీల దగ్గరకు తీసుకెళ్లి, అక్కడ విచారణ చేసుకునే వెసులుబాటు కల్పిస్తామని యాజమాన్యం తెలపగా.. మా గ్రామంలో ఫ్యాక్టరీ ఏర్పాటు చేయవద్దని చెప్పామని గ్రామస్తులు తెలిపారు. ఫ్యాక్టరీ ఏర్పాటు వల్ల తమకు వచ్చే నష్టాలను తెలిపామని వారు అన్నారు. కార్యక్రమంలో మాన్‌దొడ్డి, చిన్నధన్వాడ, తుమ్మిళ్ల, నసనూరు తదితర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

భూ భారతి చట్టం రైతులకు వరంలాంటిది


లింగాలలో మాట్లాడుతున్న ఎంపీ మల్లురవి, పక్కన అదనపు కలెక్టర్ అమరేందర్

లింగాల/ బల్మూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన భూ భారతి చట్టం –2025 రైతులకు వరంలాంటిదని ఎంపీ మల్లురవి అన్నారు. మంగళవారం లింగాల, బల్మూరులోని రైతువేదికల్లో నిర్వహించిన భూ భారతి చట్టం అవగాహన సదస్సుకు ఎంపీతోపాటు అదనపు కలెక్టర్ అమరేందర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసి ధరణి వల్ల పేద రైతులు ఎంతో ఇబ్బందులు పడ్డారని, భూములు కోల్పోయారని దానిని దృష్టిలో ఉంచుకొని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో మార్పులతో భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చిందన్నారు. ఈ చట్టంతో భూ సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందన్నారు. అధికారులు వచ్చే నెలలో గ్రామాల వారిగా పర్యటించి సదస్సులు నిర్వహిస్తారని, ఇందుకోసం రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషిచేస్తుందని, ప్రతి గ్రామంలో గ్రామ పరిపాలన అధికారులను నియమించడానికి కసరత్తు జరుగుతుందని చెప్పారు. ఆధార్ కార్డు తరహాలో భూమికి భూదార్ సంఖ్య కేటాయించడం జరుగుతుందని, దీనివల్ల భూములు ఆక్రమణకు గురయ్యే అవకాశాలు ఉండవన్నారు. ప్రతిపక్షాలు తమ ఉనికి చాటుకోవడానికి ముఖ్యమంత్రిపై తప్పుడు విమర్శలు చేస్తున్నారని ఎంపీ మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు బీఆర్ఎస్, బీజేపీ ఎన్ని కుయుక్తులు పన్నినా వారి ఆటలు సాగవని, అలా చేస్తే ప్రజలే బట్టలూడదీసి ఉరికించి కొడతారన్నారు. అదనపు కలెక్టర్ అమరేందర్ మాట్లాడుతూ సాదాబైనామాలు, వారసత్వ, అసైన్డ్, పోరంబోకు భూములలో ఉన్న లోపాలను సరి చేసుకోవచ్చన్నారు. భూ భారతి పోర్టల్‌లో పొందుపర్చిన రికార్డుల ఆధారంగా బ్యాంక్‌లు రుణాలు ఇస్తాయన్నారు. ఆయా కార్యక్రమాల్లో మార్కెట్ చైర్మన్ రజిత, డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ రవీందర్, తహసీల్దార్లు పాండునాయక్, శ్రీకాంత్, కాంగ్రెస్ నాయకులు రంగినేని శ్రీనివాస్‌రావు, నాగేశ్వర్‌రావు, వెంకట్‌రెడ్డి, కాశన్నయాదవ్, రాంప్రసాద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నాసిరకం మట్టితో రైల్వే స్టేషన్ పనులు

అలంపూర్: జోగుళాంబ రైల్వే స్టేషన్ వద్ద నాసిరకం మట్టితో పనులు చేపడుతున్నారని బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి ఆరోపించారు. అలంపూర్ చౌరస్తా సమీపంలోని జోగుళాంబ రైల్వే స్టేషన్ వద్ద చేపడుతున్న పనులను ఆయనతోపాటు నాయకులు మంగళవారం సందర్శించారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో సెంట్రల్ రైల్వే అధికారులు రెండేళ్లుగా పనులు చేపడుతున్నారని, అయితే, అధికారుల పర్యవేక్షణ కొరవడంతో ట్రాక్‌ల పక్కన ఎర్రమట్టికి బదులుగా సుద్ద మట్టితో పనులు చేస్తున్నారని ఆరోపించారు. వర్షాకాలంలో ట్రాక్ పక్కన వేసిన సుద్ద మట్టి జిగురుగా మారి ప్రయాణికులు జారిపడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. నాసిరకం మట్టిని తరలించి పనులు చేపడుతున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని రాజగోపాల్, పిడుగు వెంకటేష్, రాజశేఖర్ శర్మ, నాగేశ్వర రెడ్డి, సుధాకర్ యాదవ్, లక్ష్మణ్ గౌడ్, రవి, సుంకన్న, ఉపేంద్ర తదితరులు ఉన్నారు.


రైల్వే ట్రాక్ కోసం తెచ్చిన సుద్ద మట్టిని చూపిస్తున్న బీజేపీ నాయకులు

రైతు సంబరాలను అడ్డుకున్న పోలీసులు


బల్గెరలో హనుమంతునాయుడును ఇంటి వద్ద పోలీసులు, గుమిగూడిన జనాలు

గట్టు: మండలంలోని బల్గెరలో దిగంబరస్వామి జాతర సందర్భంగా మంగళవారం నిర్వహించాల్సిన రైతు సంబరాలను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. గట్టు ఎస్ఐ మల్లేష్,మల్దకల్ ఎస్ఐ నందికర్, కేటీదొడ్డి ఎస్ఐ శ్రీనివాస్‌తోపాటు భారీగా పోలీసు బలగాలు బల్గెరకు చేరుకున్నాయి. రైతు సంబరాలను నిర్వహించే బీఆర్ఎస్ నేత బల్గెర హనుమంతును అతని ఇంటి దగ్గరే హౌస్ అరెస్టు చేశారు. రైతు సంబరాలను నిర్వహించడానికి వీలు లేదని, అలా కాదని ఎవరైనా ప్రయత్నిస్తే కేసులు నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరించారు. దీంతో విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు, రైతులు పెద్ద ఎత్తున హనుమంతునాయుడు ఇంటికి చేరుకున్నారు. కొంత సేపు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. కొన్నేళ్లుగా ప్రశాంతంగా నిర్వహిస్తున్న రైతు సంబరాలను ఇప్పుడు అడ్డుకోవడం ఏమిటని, రాజకీయ కక్షతోనే ఇదంతా చేస్తున్నారని, కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం మోసపూరితంగా అడ్డుకుంటున్నట్లు హనుమంతునాయుడు ఆరోపించారు. పోటీల్లో పాల్గొనేందుకు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ఎద్దుల యజయానులను పంపించేశారు. రాత్రి వరకు పోలీసులు బల్గెరలో పికెట్ ఏర్పాటు చేశారు.

కోళ్ల ఫారాల్లో తనిఖీలు

అలంపూర్: అలంపూర్ చౌరస్తాలోని ఉత్తర ఫుడ్స్ ఫీడ్స్ పౌల్ట్రీ ఫారాన్ని ఉండవెల్లి మండల పశు సంవర్ధక శాఖ వైద్య అధికారిని శిరీష, డాక్టర్ సతీష్, వీఎల్ఓ రమణమ్మ, జేవీఓ శ్రీశైలం మంగళవారం పరిశీలించారు. అలంపూర్ చౌరస్తాలోని ఉత్తర ఫుడ్స్ ఫీడ్స్ పౌల్ట్రీ ఫారంలో బ్లడ్ ఫ్లూతో కోళ్లు చనిపోతున్నాయని గత రెండు రోజులుగా సోషల్ మీడియాలో పోస్టులు వైరల్ అయ్యాయి. కోళ్లను కాల్చడం వలన సమీపంలో ఉన్న వెంకటసాయి నగర్ కాలనీలోని ప్రజలు అనారోగ్యానికి గురువుతున్నట్లు ఆరోపణలు వచ్చాయి. దీంతో స్పందించిన పశు వైద్య అధికారులు కోళ్ల ఫారాన్ని సందర్శించి పరిశీలించినట్లు తెలిపారు. అక్కడ బ్లడ్ ఫ్లూకు సంబంధించిన ఎలాంటి ఆనవాళ్లు లేవని, పౌల్ట్రీలో రోజు వారిగా మృతి చెందే కోళ్లను సాధారణంగా కాల్చారని, దీనివలన సమీపంలోని కాలనీ ప్రజలకు ఇబ్బందిగా మారడంతో పూడ్చి పెట్టాలని వారికి సూచించినట్లు తెలిపారు.

యోగా చేయడం అలవాటు చేసుకోవాలి

నాగర్‌కర్నూల్ క్రైం: వయసుతో సంబంధం లేకుండా యోగాసనాలు వేసి ఆహారం నియమాలు పాటిస్తే ప్రతిఒక్కరూ ఆరోగ్యవంతులవుతారని ఆయుష్ వైద్యుడు షబాజ్ మాలిక్ అన్నారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని జనరల్ ఆస్పత్రిలో యోగా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన దేశం యోగాసనాలకు, ప్రకృతి, మూలిక వైద్యులకు ప్రసిద్ధి చెందిందన్నారు. యోగా వల్ల కీళ్ల నొప్పులు, గ్యాస్ సమస్యలు, దీర్ఘకాలిక రోగాలు తగ్గడంతోపాటు ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయన్నారు. ప్రాణాయామం, యోగాసనాల వల్ల సుఖప్రసవాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, ఇవి యోగా శిక్షకుల పర్యవేక్షణలో చేయాలన్నారు. యునాని యోగా సెంటర్‌లో మహిళ, పురుష యోగా శిక్షకులు ఉన్నారని, యోగా సెంటర్‌లో ఉదయం శిక్షణ ఇస్తారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

'వాగ్దేవి' విద్యార్థుల విజయ దుందుభి


ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ విజేత వెంకట్‌రెడ్డి, యాజమాన్య సభ్యులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో జిల్లా కేంద్రంలోని వాగ్దేవి కళాశాల విద్యార్థులు విజయ దుందుభి మోగించారని కళాశాల కరస్పాండెంట్ విజేత వెంకట్‌రెడ్డి తెలిపారు. మొదటి సంవత్సరం ఎంపీసీ విభాగంలో అమీనా 468, అక్షయశ్రీ 466, అమృత వర్షిణి 465, వైశాలి 465 మార్కులు సాధించగా.. బైపీసీ విభాగంలో సంజన 436, అలానే ఫరీహ 435, పాయల్ సింగ్ 435, మదియా తరహా 435 మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగంలో నవనీత్‌గౌడ్ 992, బైపీసీ విభాగంలో రబ్‌షా 991, సపూరా 989 మార్కులతో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని ఆయన పేర్కొన్నారు. కళాశాలలో ఇన్నోవేటివ్ సైంటిఫిక్ టీచింగ్ అప్రోచ్ కార్యక్రమం ద్వారా విద్యార్థులు మంచి మార్కులు సాధించారన్నారు. ఇంతటి ఘనవిజయం సాధించేందుకు సహకరించిన విద్యార్థుల తల్లిదండ్రులు, అధ్యాపకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గీతాదేవి, అకాడమిక్ ఇన్‌చార్జి పావని, కోట్ల శివకుమార్, రాఘవేందర్‌రావు, నాగేందర్, సతీశ్‌రెడ్డి, బాబుల్‌రెడ్డి, రఘువర్ధన్‌రెడ్డి, జ్యోతినందన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో 'రిషి' సంచలనం


ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న రిషి కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని రిషి జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ పరీక్ష ఫలితాల్లో సంచలనం సృష్టించారు. రాష్ట్రస్థాయిలో సత్తా చాటినట్లు కళాశాల చైర్‌పర్సన్ చంద్రకళ వెంకటయ్య తెలిపారు. మొదటి సంవత్సరం ఎంపీసీ విభాగంలో భావన 468 మార్కులు సాధించగా.. మరో ఏడుగురు విద్యార్థులు 467 మార్కులతో ప్రతిభ చాటారు. బైపీసీలో మలిహా కోహికశ 438 మార్కులు సాధించగా.. ముగ్గురు 437, మరో ముగ్గురు 436 మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో మేఘన 993తో పాటు మరో ఐదుగురు 990 మార్కులు సాధించారు. బైపీసీలో మలిహా తహసీయత్ 992 మార్కులు, మరో ఐదుగురు 990 మార్కులు సాధించారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను మంగళవారం కళాశాల యాజమాన్యం అభినందించింది. కార్యక్రమంలో కళాశాల అడ్వైజర్ వెంకటయ్య, అకాడమిక్ డీన్ లక్ష్మారెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ డీన్ భూపాల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ప్రసన్నలక్ష్మి, రాఘవేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

'ప్రతిభ' విద్యార్థుల విజయఢంకా


ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రతిభ కళాశాల యాజమాన్యం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో జిల్లా కేంద్రంలోని ప్రతిభ జూనియర్ కళాశాల విద్యార్థులు విజయఢంకా మోగించారు. మొదటి సంవత్సరం ఎంపీసీలో వైష్ణవి 468, ఉపేంద్ర 468, విజయలక్ష్మి 467, గణేశ్ 467, అక్షితారెడ్డి 467, సాయిచరణ్ 467, కీర్తి 466, భవనేష్ 466, అయిసా తహరీన్ 466, హర్షిత 466, వర్షిణి 466, హారియా రశీద్ 466, విశాల్ 466, శోభారాణి 466, నవీన్‌కుమార్ 466, శ్రీనితీన్ 466, త్రిష 466 మార్కులు సాధించారు. బైపీసీ విభాగంలో నెక్కొండ హాసి 436, వైష్ణవి 436, సుప్రజ 435 మార్కులతో ప్రతిభ చాటారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో అక్షిత 994, అమోఘ 993, భవిత 992, శివజ్యోతిక 992, అమిమ ఫాతిమా 992, వర్షిత్‌గౌడ్ 992 మార్కులు సాధించగా.. బైపీసీ విభాగంలో అక్షిత 994, అజీం కౌసర్ 991, జైన్‌బిన్ మొహమ్మద్ 990, భూమిక 990 మార్కులు సాధించారు. మొదటి సంవత్సరంలో 400 పైగా 514మంది, ద్వితీయ సంవత్సరంలో 900 మార్కులకు పైగా 432 మంది సాధించినట్లు యాజమాన్యం పేర్కొంది.

దరఖాస్తుల ఆహ్వానం

కందనూలు: జిల్లాలోని 20 మండలాల్లో ప్రాథమిక, ఉన్నత పాఠశాలల స్థాయిలో మండల, జిల్లా స్థాయి ఆర్‌పీలుగా పనిచేయడానికి ఆసక్తి గల ప్రభుత్వ ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ రమేష్‌కుమార్ తెలిపారు. గురువారంలోగా డీఈఓ కార్యాలయంలో దరఖాస్తులు అందించాలని తెలిపారు.